# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

సత్యవాక్కు

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 10 | జూన్ 1990 | సంచిక 11


## సంపాదకీయము

### బాప్తిస్మమును గూర్చి తరచుగా అడిగే ప్రశ్నలు

### (Questions Often Asked About Baptism)

బాప్తిస్మమును గూర్చి చాలా మంది ప్రశ్నించుదురు. కొన్ని సార్లు వారు దానియొక్క సమాచారమును తెలిసికొన ప్రయత్నించరుగాని దానిని గూర్చి వ్యాఖ్యానింతురు. బాప్తిస్మమును గూర్చి తరచుగా అడిగే ప్రశ్నలకు బైబిలు బోధ ఆధారంగా జవాబులివ్వదలిచాము.

క్రీస్తు ఎందుకు బాప్తిస్మము పొందెను? ఆయన దేవుని కుమారుడై యుండి పాపరహితుడై యుండెను. ఆయన బాప్తిస్మము పొందుటను గూర్చి యోహాను పై విధముగ తలంచగా క్రీస్తు యిట్లు చెప్పెను. "ఇప్పటికి కానిమ్ము, నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తర మిచ్చెను" (మత్త 3 : 15) ఆ కారణంగా యోహాను ఆయనకు బాప్తిస్మ మిచ్చెను. క్రీస్తు బాప్తిస్మము పొందక

పోయిన యెడల జరిగేదేమి? క్రీస్తు బాప్తిస్మము పొందనప్పుడు మన మెందుకు బాప్తిస్మము పొందాలని జనులు ప్రశ్నించుదురు. అందు వలన ఆయన బాప్తీస్మము యిలాంటి ప్రశ్నలకు అవకాశంలేకుండ చేసింది.

క్రీస్తు ఎట్లు బాప్తిస్మము పొందెను? అది చిలకరింపా, నీటిని తలపై కుమ్మరించడమా లేక ముంచడమా? చాలా చలన చిత్రాలలో యోహాను, క్రీస్తు ప్రభువుకు తలపై, నీళ్ళు కుమ్మరించుట ద్వారా బాప్తిస్మ మిచ్చినట్లు చిత్రీకరించడం మన మెరిగియున్నాము. వారి విధము సరయినది కాదు. ఎందుకనగా లేఖనాలు చెప్పే సత్యాలకు భిన్నంగా వారట్లు చిత్రీకరించి యున్నారు. మానవకల్పిత పద్ధతుల ననుసరించేవారు చేసే వత్తిడులవల్ల కూడ ఈలాగు జరుగు చున్నది. సలీము దగ్గరనున్న ఐనోనను స్థలమున నీళ్ళు విస్తారముగా ఉండెను గనుక బాప్తిస్మ మిచ్చు యోహాను కూడ అక్కడ బాప్తిస్మ మిచ్చుచు ఉండెనని యోహాను చెప్పెను (యోహా 3:22, 23). క్రీస్తు బాప్తిస్మము పొందినప్పుడు యోహాను యోర్దానులో బాప్తిస్మ మిచ్చుచుండెను. క్రీస్తు బాప్తిస్మము పొందిన తరువాత నీటిలోనుండి బయటకు వచ్చినట్లు మత్తయి, మార్కు లిరువురు వ్రాసిరి. చిలక రింపుగాని, నీటిని తలపై కుమ్మరించడం ద్వారా మాత్రమే ఆయన బాప్తిస్మము పొందినట్లయితే ఆయన నీటిలోనికి పైగా నదిలోనికి ఎందుకు వెళ్ళవలసి వచ్చెను? అది ఎక్కడైనా జరిగించ వచ్చును కదా! కాని క్రీస్తును నీటిసమాధి చేయుటకు లేదా ముంచుటకు కవ సరమైనంత నీరు ఆ ప్రదేశములో యోర్దాను నదిలో ఉండెను. అదే బాప్తిస్మము యొక్క అర్థము, నీటి సమాధి లేదా ముంచుట. నీరు అనే పదానికి ఆత్మీయార్థం ఇక్కడ ఏమీ లేదు. అ॥ కార్య 8:26-39లో వ్రాయబడినట్లు ఐతియోపీయుడైన ఒక మనుష్యుడు బాప్తిస్మము పొందినపుడు అతడును ఫిలిప్పును యిద్దరు నీటిలోనికి దిగిరి. ఫిలిప్పు

అతనికి బాప్తిస్మ మిచ్చెను. 'వారు నీటిలోనుండి వెడలి వచ్చినప్పుడు' అని స్పష్టముగ వ్రాయబడినది. ఏమి జరిగింది అనే విషయంలో సందేహ మేమియులేదు. దీనిని గూర్చి వాదించే వారు తమ నీడతోనే వాదించవలసియున్నది.

రక్షింపబడుటకు బాప్తిస్మము అవసరమైతే మార్కు 16:16లో క్రీస్తు నమ్మక బాప్తిస్మము పొందక యున్నవాడు నశించును అని ఎందుకు చెప్పలేదు? దీనికి ఒక హేతువున్నది. ఒకడు నమ్మకపోతే బాప్తిస్మము పొందడు. మార్కు 16 : 16లో ఆయన ఒకడు రక్షింపబడాలంటే నమ్మి బాప్తిస్మము పొందవలెనని చెప్పెను. కాని ఒకడు నశించాలని కోరుకొంటే అతడు నమ్మవలసిన అవసరముండదు. రక్షింపబడుటకు నమ్మి బాప్తిస్మము పొందవలెనని చెప్పెను. యిప్పుడు దానిని నీవు జరిగించక పోవుట ద్వారా ఆత్మసంబంధమైన రక్షణను పోగొట్టుకొనుటకే సిద్ధంగా ఉన్నావా? నీవట్టి విధంగా ఆలోచిస్తే వ్యర్థమే!

నీటిలో రక్షణ ఉన్నదా? రక్షించే శక్తి నీటికి ఉన్నదని ఎవరూ చెప్పలేదు. రక్షించేది నీరు కాదు. క్రీస్తే, ఎవరైతే ఆయన ఆజ్ఞలకు విధేయులగుచున్నారో వారిని ఆయన రక్షించును. ఆ ఆజ్ఞలలో ఒకటి బాప్తిస్మము పొందుట లేదా నీటిలో ముంచబడుట. కొన్నిసార్లు మనం నోవహును అతని విధేయతను ఉదాహరణగా ఉపయోగించుకొంటాం. నీరు అతన్ని రక్షించలేదుగాని నీటి ద్వారా అతడు రక్షింపబడెను. ఈ రెంటికి తేడా ఏమిటి? తేడా యేమంటే నీరు రక్షకుడు కాదు. దేవుడే రక్షకుడు. ఆయన ఆజ్ఞలకు విధేయుడైనందున దేవుడు నోవహును రక్షించెను. ఓడ నిర్మించుకొని, జంతువులను మిగిలిన వాటిని అందు ప్రవేశింపజేసెను. అప్పుడు దుష్టులను నశింపజేయుటకు దేవుడు నీటిని ఉపయోగించుకొనెను. ఓడ పైకి లేచు

నట్లు నీటిని ఉపయోగించి నోవహును, మిగిలిన వాటిని ఆయన రక్షించెను. నీరు రక్షించలేదని నోవహు దేవునితో వివాదానికి దిగి ఓడ నిర్మించుటను నిరాకరించి నట్లయితే ఏమగును? వారు రక్షింపబడనేరరు కదా! బాప్తిస్మమను దేవుని ఆజ్ఞను నిరాకరించి నీరు రక్షించలేదని వాదనకు దిగేవారు రక్షింపబడనేరరు కదా!

బాప్తిస్మము మాత్రమే రక్షించునా? బాప్తిస్మము రక్షించునని పేతురు చెప్పెను. 1 పేతురు 3 : 21. బాప్తిస్మము మాత్రమే రక్షించునని అతడు చెప్పలేదు. రక్షింపబడుటకు కొన్ని జరిగించాలని దేవుడు మానవుని కోరెను. అన్నియు జరిగించినపుడే రక్షణ సాధ్యము. ఉదాహరణకు విశ్వాసము మాత్రమే రక్షించదు. మారుమనస్సు ఒక్కటి మాత్రమే రక్షించదు. క్రీస్తును ఒప్పుకొనుట మాత్రమే రక్షించదు. బాప్తిస్మము మాత్రమే రక్షించదు. ఒకడు ఈ ఆజ్ఞలన్నిటికీ విధేయుడైనప్పుడే ప్రభువు అతనిని రక్షించును. మానవుడు ఈ ఆజ్ఞయని ఆ ఆజ్ఞయని సమస్య తీసుకొని వచ్చినప్పుడు కలవరము చెంది యితరులను కూడ కలవర పెట్టుచున్నాడు. అపొస్తలుల కార్యముల గ్రంథమునందలి మార్పుచెందిన క్రమాన్ని పరిశీలించినపుడు వారేమి చేసిరో ఏవిధంగా వారు అంటే రక్షింపబడినవారు ఈ ఆజ్ఞలన్నిటికిని విధేయులయ్యారో, ఎట్లు రక్షింపబడి సంఘముతో చేర్చబడ్డారో, క్రీస్తులోనికి దేవుని పిల్లలుగా ఎట్లు ప్రవేశించారో అర్థమగును.

బాప్తిస్మము లేకుండ ఒకడు రక్షింపబడగలడా? ఈ ఆజ్ఞకు విధేయుడు కాకుండ ఒకడు రక్షింపబడ గలిగినట్లయితే క్రీస్తుకు ఆయన సంఘానికి వెలుపలనుండి ఒకడు రక్షింపబడ గలిగినట్లయితే మార్కు 16 : 16 రోమా 6:3-4 గలతి 3:26-27 2 కొరింథి 5 : 17, 1 కొరింథీ 12 : 13 ఈవచన భాగాన్ని చదివి పైవిధంగా జరగడం సాధ్యమని నీ వనుకొనుచున్నావా?

బాప్తిస్మము పొందకుండ ఒకడు తిరిగి జన్మించుట సాధ్యమా? నిజానికి బాప్తిస్మము పొందుటయే తిరిగి జన్మించుట. యోహాను 3:3-5లో ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను తిరిగి జన్మించవలెనని క్రీస్తు చెప్పెను. బాప్తిస్మము పొందకుండ నీటి మూలముగా తిరిగి జన్మించుట ఎట్లు? బాప్తిస్మము పొందినప్పుడు ఒకడు నీటిలో ముంచబడుచున్నాడు. నీటిలో నుండి వెలుపలికి వచ్చి తిరిగి జన్మించుచున్నాడు లేక నూతన సృష్టియగుచున్నాడు (రోమా 6:3, 4 కొలస్స 2:12). ఒకడు బాప్తిస్మము పొంది క్రీస్తునందు ప్రవేశించుచున్నాడని, ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి యని పౌలు చెప్పుచున్నాడు (2 కొరింధి 5:17).

ఒకడు రెండుసార్లు లేదా తిరిగి బాప్తిస్మము పొందవచ్చునా? ఒకడు ఎన్నిసార్లు ముంచబడినప్పటికిని వాక్యానుసారమైన బాప్తిస్మ మొక్కటే (ఎఫెస్సీ 4:4-6). ఆ బాప్తిస్మము నీటిలో ముంచబడుట, అది పాపక్షమాపణ నిమిత్తము, అది ఒకని క్రీస్తులోను అనగా ఆయన సంఘములో నుంచుటకు, అది ప్రభువు ఆజ్ఞకు ఆయన అధికారానికి లోబడుటనై యున్నది (రోమా 6:3, 4; అ. కార్య. 8:26-39; అ. కార్య. 2:38; గలతి 3:26, 27; 1 కొరింధి 12:13, మత్త 28:19, 20). రెండుసార్లు బాప్తిస్మము, తిరిగి బాప్తిస్మము వంటిదేమీ లేదు. ఇట్టి భాషను మానవులు వాడుచున్నారేగాని లేఖనములు కాదు. ఒకడు బాప్తిస్మము పొంది అది వాక్యానుసారమైనది కాదని భావించి తిరిగి బాప్తిస్మము పొందినట్లయితే ఆ మొదటిది బాప్తిస్మము కాదు. ముంచడము మాత్రమే. వాక్యానుసారమైనది కాకపోయినట్లయితే అది బాప్తిస్మము కాదు, ముంచబడడం మాత్రమే. దేవుని చిత్తానుసారమైన బాప్తిస్మ మొక్కటే.

ఎప్పుడు ఒకడు బాప్తిస్మముపొందవలెను? దేవునియందు విశ్వాస

ముంచగలిగిన వయస్సు వచ్చినప్పుడు, పాపముల విషయమై మారు మనస్సు పొందగలిగినప్పుడు, నోటితో యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనగలిగినప్పుడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంద గలిగినప్పుడు (హెబ్రీ 11 : 6, అ.కార్య. 17 : 30, మత్త 10 : 32, రోమా 10 : 10, అ.కా. 2:38). రక్షణ పొందాలని కోరికగలవారు వ్యక్తిగతంగా వీటిని జరిగించవలెను. అతనికొరకు మరొకరు వీటిని చేయకూడదు.

బాప్తిస్మము పొందకుండ ఒకడు చనిపోయినట్లయితే ఎట్లు? జీవించియున్నప్పుడు మనము బోధించుచున్నాము. ప్రతివాడు నమ్మి బాప్తిస్మము పొందవలెనని ప్రభువు చెప్పెను (మార్కు 16 : 16). చనిపోయిన వారితో తీర్పుదినమందు ఆయన సంప్రదించును. ఆయన న్యాయాధిపతి అని విశ్వసించుటకు ప్రతి ఆధారము మనకు కలదు. మనము ఎవరినీ పరలోకానికి తీసుకొని పొమ్మటగాని, నరకమునకు పంపించుటగాని చేయలేము. ప్రభువు. వారితో సంప్రదించును. నేను నీవు ఆయన ఆజ్ఞాపించిన రీతిగా నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడుము.

బాప్తిస్మమునుగూర్చి ఈ ప్రశ్నలకు యివ్వబడిన సమాధానాలు మీకు సహకారిగా నుండగలవని ప్రార్థించుచున్నాను. దేవుడాజ్ఞాపించినట్లు బాప్తిస్మము పొందినట్లయితే ఏ సమస్యలేదు. ఈ అంశమును గాని యితర అంశాల విషయంలోగాని ఏమిచేయాలో, ఏమి చేయకూడదో అనే విషయంలో ప్రభువు బోధను వక్రీకరించినప్పుడే సమస్య ఉత్పన్నమగుచున్నది. దయచేసి మోసపోవద్దు. ప్రభువు మాట విని ఆయన చిత్తాన్ని జరిగించండి. అప్పుడు మీరు సరియైన మార్గంలో నుందురు. రక్షింపబడుదురు.

# క్రీస్తు నందు ఎదుగుట

'ఎదుగుదల' అనునది అన్నివిషయాలలోను ఆశింపదగినది. చిన్న పిల్లలు, శరీర సౌష్ట్యం లేనివారును, ప్రకృతిలోని చెట్లు, జంతువులు, మొదలగు వాటిని ఎదుగవలెనని కోరుచుందురు. ఆలాగుననే క్రీస్తు యొక్క శరీరమైన మనము ఎదుగవలెనని క్రొత్తనిబంధన బోధించుచున్నది. "క్రీస్తువలె ఉండుటకు మన మన్ని విషయములలో ఎదుగుదము" (ఎఫెసి 4:15).

ఒకడు శిశువుగానే ఉండిపోయినట్లయితే ఏమి ప్రయోజనము? అట్లే ఆత్మీయముగా జన్మించిన క్రైస్తవుడు ఎదుగక పోయినట్లయిన ప్రయోజనము లేదు కదా అతనికే హాని. కొందరు బాప్తిస్మము తీసికొని దాని గూర్చిన బోధలనే తప్ప ఇక ఏవిషయములలోను ఎదుగరు. అదే వారి పరిపక్వత అని తలంతురు. ఇది చాలా విచారకరము. "పాలు త్రాగువాడు శిశువే గనుక నీతివాక్య విషయములో అనుభవము లేనివాడై యున్నాడు" (హెబ్రీ 5:13). బాప్తిస్మము పొందిన తరువాత క్రైస్తవ జీవితము ప్రారంభమగును. అట్లు దిన దినము అతడు వృద్ధి పొందుచుండవలెను.

క్రైస్తవుడు ఏయే విషయములలో ఎదుగవలెనో తెలిసికొందము: క్రైస్తవ సద్గుణములలో ఎదుగవలెను. "కాబట్టి మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగిన వారై ప్రేమతో ఒకని నొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడచుకొనవలెనని..." (ఎఫెస్సి 4:1-3). ఈవాక్య భాగములో సద్గుణములు మనకు కనబడును. వీటియందు క్రైస్తవుడు ఎదుగవలెను.

1. ప్రేమ : ప్రేమను గూర్చి తెలియనివారు, విననివారు ఉండరు. ఎందుకనగా ఈ సృష్టిలో తీయనిది ప్రేమ అంటారు. కాని అనేకులు ఈ ప్రేమను చూపుటలో ఎదుగుటలేదు. ప్రేమకు స్వార్థమును జత చేసి ప్రేమ అర్థాన్ని మార్చివేయుచున్నారు. ఒకనినొకడు ప్రేమింపవలెనని బైబిలు బోధించుచున్నది (యోహాను 13 : 34, 35). కాని దీనికి భిన్నముగా ఒకరిపై ఒకరు అసూయపడుట, కోపము కలిగియుండుట జరుగుచున్నది. ఇట్టిది క్రైస్తవ ఎదుగుదలకు పెద్ద ఆటంకము వంటిది. క్రైస్తవులలో నిజమైన ప్రేమ ఉంటే ఈ క్రింది వాక్యభాగములను వారు పాటించుదురు (యాకోబు 1 : 27; 2 : 14-20). తనకు తాను ప్రేమించుకొనుట ఎదుగదలకాదు గాని ఇతరులను ప్రేమింపవలెను.

2. సాత్వికము : దీనిని క్రైస్తవులలో ఎంతమంది కలిగియున్నారు? ఇతరులపై కోపపడుట, ఇతరులను శిక్షించుట, దూషించుట మొ॥నవి సాత్వికమునకు భిన్నమైనవి. ఇతరుల యెడల సహనమును, ఓర్పును కలిగియుండాలి. క్రీస్తు యొక్క జీవితం సాత్వికమును కలిగియుంది. అట్లె మనము క్రీస్తు యొక్క సాత్వికమును కలిగియుండాలి. ఇది ఆత్మఫలములలో ఒకటి కూడా (గలతి 5 : 22). దీనిని కలిగి యున్నవారు ధన్యులు అని ప్రభువు చెప్పెను (మత్తయి 5 : 5). ఇట్టి గొప్ప సద్గుణములో క్రైస్తవుడు ఎదుగవలెను.

3. దీర్ఘశాంతము : యేసుక్రీస్తు పూర్ణమైన దీర్ఘశాంతమును కలిగినవాడు (1 తిమోతి 1 : 16). దేవుడు దీర్ఘశాంతము గలవాడు. (1 పేతురు 3 : 20). క్రైస్తవుడు ఈ సద్గుణ విషయములలో ఎట్లున్నాడు? కొందరు అప్పటికప్పుడు కోపముతో ఇతరులపై రుసరుసలాడుదురు. కాని ఇది క్రైస్తవ ఎదుగుదలకు ఆటంకము అని గ్రహింపవలెను. శాంతమును కలిగియుండాలి. శాంతిలేనివాడు క్రీస్తువాడుకాదు.

4. వినయము : "గర్విష్ఠులతో దోపుడు సొమ్ము పంచుకొనుట కంటె దీన మనస్సు కలిగి దీనులతో పొత్తు చేయుట మేలు" (సామె 16 ; 9). ఒకని నొకడు తగ్గించుకొనే జీవితమును క్రీస్తు తన శిష్యుల పాదములు కడుగుట ద్వారా వెల్లడి చేసెను. నేడు మనము ఒకరి పాదములు ఒకరు కడుగుకొన పనిలేదు కాని ఒకరి నొకరు గౌరవించుట, ప్రేమించుట, గర్వములేని జీవితము జీవించుట చేసిన చాలును.

పై విషయములలో క్రైస్తవుడు ఎదుగవలెను. మన క్రైస్తవ జీవితము మన ఆత్మీయ ఎదుగుదలపై ఆధారపడియున్నది. మానవ శరీరము పెరుగుదల ఆరోగ్యం పై నేగాక వ్యాయామముపై ఆధార పడి ఉంది. అట్లే క్రైస్తవుడు పై విషయములను సాధకము చేయవలెను. ప్రతి మనుష్యుడు జ్ఞానములో ఎదుగవలెను (కొలస్స 1:28). రక్షణ విషయమై వాక్యమనే పాలవలన ఎదుగవలెను. (1 పేతురు 2 : 2). బలహీనులను ప్రోత్సహింప బద్ధులమై యున్నాము. (రోమా 15 : 1). ఆత్మ ఫలములు ఫలించుట ద్వారా ఎదుగుదల కలిగి యుందుము (గలతి 5 : 22). "ఎదిగే క్రైస్తవుడు ఎదిగే చెట్టును పోలియున్నాడు."...ఇంక చిగురు పెట్టుచు సారము కలిగి పచ్చగా ఉందురు (కీర్త 92 : 14). ఎదుగని క్రైస్తవుడు ఎట్లుండుననగా "...కాయలు రాలి ఫలము లేక, రెండుమారులు చచ్చి వేళ్ళతో పెళ్ళగింపబడిన చెట్లుగా" నుండును (యూదా 12).

ప్రియులారా, మనము క్రీస్తువలె ఎదుగుటకు ఆయనను పోలి నడుచుకొందము, సద్గుణములను కలిగి చిగురించు చెట్టువలె ఉందము.

— దేవరపల్లి చిరంజీవి, కాకినాడ.

# " సత్యవాక్యమును సరిగా విభజించుట ".
## ( 2 తిమోతి 2 : 15 )
## ("Rightly Dividing the word of Truth")

బైబిలు ఒక అసామాన్యమైన గ్రంథము. దేవుడు దాని యొక్క గ్రంథకర్త. "యెహోవా మాటలాడుచున్నాడు. ఆకాశమా ఆలకించుము; భూమీ చెవి యొగ్గుము" (యెష 1 : 2). ఇది దాని యొక్క మూలము. హెబ్రీ పత్రిక యొక్క లేఖకుడు ఈలాగు చెప్పెను: "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" హెబ్రీ 1:2,2). ఈ వాక్య భాగమందు మరియు మిగిలిన వాక్య భాగాలయందు మనము గమనించ దగిన విషయమేదనగా "దేవుడు మాటలాడెను" మరియు "దేవుడు ఈలాగు సెలవిచ్చెను" అని వ్రాయబడి యున్నది.

## దేవుని గ్రంథము

బైబిలు మానవ కల్పితమైన గ్రంథము కాదు. పౌలు చెప్పిన స్పష్టమైన భాష వినండి. "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియ జెప్పుచున్నాను. మనుష్యుని వలన నేను దానిని పొందలేదు, నాకెవడును దాని బోధింపనులేదు గాని యేసుక్రీస్తు బయలు పరచుట వలననే అది నాకు లభించినది" (గలతీ 1 : 11, 12). దేవుని చిత్తమును గూర్చి పౌలు మాట్లాడుచూ యిట్లు చెప్పెను: "మనకైతే (అపొస్తలులకు) దేవుడు వాటిని తన ఆత్మవలన బయలు పరచి యున్నాడు". ( I కొరింథి 2 : 10).

## ఆత్మావేశము వలన వ్రాయబడిన గ్రంథము

బైబిలు ఆత్మావేశము వలన వ్రాయబడిన దేవుని వాక్యము.

"దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజన కరమై యున్నది" (2 తిమోతి 3 : 16, 17). దైవావేశము అంటే ఏమిటి? దేవుడు మాటలాడెనని అర్థము. లేఖనము మానవులు జాగ్రత్తగా గ్రహించి సత్యమును బోధించుటకు సిద్ధపడి యుండునట్లు దేవుని నోటనుండి వెలువడెను. పేతురు ఇట్లు చెప్పెను: "మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపించబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతు 1 : 21). దేవుని ద్వారా నియమింపబడి దేవుని ద్వారా సిద్ధపడి, పంపబడిన మనుష్యులు మిగిలిన వారికి వీటిని బోధించిరి. ఆత్మావేశమనగా వారు ఏ అబద్ధ సిద్ధాంతము లేని స్వచ్ఛమైన బోధను బోధించిరి. వారి బోధలో ఎట్టి తప్పిదము చేయలేదు. కారణ మేమనగా దేవుడు వారి ద్వారా మాటలాడెను. యిది మానవుల కొరకైన దేవుని గ్రంథము. మానవులు దానియందు శ్రద్ధ వహించి గౌరవించవలసియున్నది.

## బైబిలు అర్థం చేసికొనగలిగిన గ్రంథము

బైబిలు అర్థము చేసికొనగలిగిన గ్రంథము. దాని యొక్క భావమును, సందేశమును నీవు అర్థము చేసికొనగలవు. అది బోధించు విషయాన్ని నీవు అర్థము చేసికొనుట సాధ్యము. మరియు దేవుడు తన "వాక్యము ద్వారా బోధించు వాటిని స్పష్టముగ తెలిసికొనగలవు. మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహా 8 : 31). రక్షణ మార్గమును గూర్చి తెలిసికొనుట కష్టతరమైన విషయము కాదు. ఒక పాపి క్రైస్తవుడగుట ఎట్లో, అతడెట్టి క్రైస్తవ జీవితాన్ని జీవించాలని దేవుడు కోరుచున్నాడో బైబిలునుండి మనం తేలికగా గ్రహించగలము. మానవులు

బోధించే అబద్ధ సిద్ధాంతాలవలన అంధులము కావడానికి కారణము బైబిలును అపార్థము చేసికొనుటవలననే జరుగుచున్నది. యేసు చెప్పిన మాట వినండి: "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15 : 9). "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (II కొరింథీ 4:4). కొందరు సువార్తను మార్పుచేసి పాడుచేయుచున్నారు "క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచినవానిని విడిచి భిన్నమైన సువార్తతట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్త కాదుగాని, క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరున్నారు. మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గలతి 1:6-8).

## పిల్లలు కూడ అర్థము చేసికొనదగిన సూక్ష్మమైనది

బైబిలును అపార్థము చేసికొనదగిన నిజమైన హేతువేమియు లేదు. పిల్లలుకూడ దేవుని చిత్తమును అర్థము చేసికొనగలరు. "క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాసముద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యమునుండి నీ వెరుగుదువు" (II తిమోతి 3:15). [illegible] (18 : [illegible]) "[illegible] [illegible] అర్థము చేసికొనుటకు సహాయముగా [illegible] [illegible] ప్రవాలు [illegible] [illegible] బైబిలు [illegible] [illegible] గములతో కలవు [illegible]

నిబంధన, రెండవది క్రొత్త నిబంధన. పాతనిబంధన హెబ్రీ భాషలోను క్రొత్తనిబంధన గ్రీకు భాషలోను వ్రాయబడినది. బైబిలునందలి పెద్ద భాగములు అర్థము చేసికొనుటకు వీలుగా వివరాలు యిస్తున్నాం.

| పాత నిబంధన | | క్రొత్త నిబంధన |
| --- | --- | --- |
| సృష్టి మొదలుకొని సిలువవరకు | † | సిలువ మొదలుకొని క్రీస్తు రెండవరాకడ వరకు |

పాతనిబంధన యందు 39 పుస్తకములు కలవు. అవి ఆదికాండముతో ఆరంభమై మలాకీతో ముగిస్తున్నాయి. పాతనిబందన గ్రంథములో వాటి స్వభావాన్ని బట్టి చట్టము, చరిత్ర, పద్యభాగము, ప్రవచనము అను భాగాలుగా విభజించిరి. క్రొత్తనిబంధన యందు 27 పుస్తకములు కలవు. అవి మత్తయి సువార్తతో ఆరంభమై ప్రకటన గ్రంథముతో ముగియుచున్నవి. (క్రీస్తు జీవిత చరిత్ర, సంఘ చరిత్ర, పత్రికలు, ప్రవచనము - అను భాగాలుగా - ఇవి విభజింపబడినవి. నిజానికి మత్తయి, మార్కు, లూకా, యోహాను ఈ పుస్తకాలు పాతనిబంధనకే చెందుతాయి. ఎందుకంటే యేసు పాత నిబంధన చట్టము క్రింద జీవించి మరణించెను. ఈ సందర్భముగా సత్యమును గూర్చి వివరించుటకు రెండు వచన భాగాల్ని ఇక్కడ దిగువ చూడండి. "అయితే, కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు, తన కుమారుని పంపెను. ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు-లోబడినవాడాయెను" (గలతి 4:4). "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను" (కొలస్స 2:14).

## బైబిలు చరిత్రలో మూడు యుగాలు

మానవునితో దేవుడు సంప్రదించిన చరిత్రను లేక కాలాన్ని మూడు యుగాలుగా విభజింపవచ్చును. ఈ పట్టిక మీకు సహకారిగా నుండగలదు.

| పితరుల యుగము | మోషే యుగము | క్రైస్తవ యుగము |
|---|---|---|
| ఆదామునుండి సీనాయి కొండ వరకు | సీనాయి కొండనుండి సిలువ వరకు | పెంతెకోస్తు దినంనుండి యుగాంతము వరకు |
| 25000 సంనత్సరాలు | 1500 సంవత్సరాలు | క్రీ॥శ 33 |

పితరుల యుగము సుమారు 2500 సంవత్సరాలు. అది ఆదాముతో మొదలు మోషేకు సీనాయి కొండపై ధర్మశాస్త్రము నిచ్చు వరకు మధ్యనున్న కాలము (లేవీ 20. ద్వితీ 5). మోషే యుగము సుమారు 1500 సంవత్సరాలు, యిది సీనాయి కొండపై మోషేకు ధర్మశాస్త్రము నిచ్చినది మొదలుకొని క్రీస్తు సిలువ వరకు మధ్యనున్న కాలము. క్రైస్తవయుగము క్రీస్తు పునరుత్థానము తరువాత మొదటి పెంతెకోస్తు దినంనుండి అంటే క్రీస్తు చనిపోయిన దినం మొదలుకొని 50 దినాల తరువాత నుండి క్రీస్తు తిరిగి వచ్చేవరకు మధ్యనున్న కాలము. ఈ కాలంలో సుమారు 2000 సంవత్సరాలు గడిచిపోయాయి.

### పితరుల యుగం యొక్క అర్థము

"పితరులు" అనే పదానికి "తండ్రులు" అని అర్థం. దేవుడు కుటుంబ యజమానులతో మాటలాడిన కాలమిది. ఉదాహరణకు దేవుడు అబ్రహాము ద్వారా తన ప్రజలతో నిబంధనలు చేసికొనెను (ఆది కాం. 12 : 1-3, 17 : 4-8). ఆకాలంలో అది కుటుంబ సంబంధమైన ఒడంబడిక.

## మోషేయుగం యొక్క అర్థము

ఈ కాలము ఒక జనాంగముతో దేవుడు నిబంధన చేసికొనిన కాలము. "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను - ఇశ్రాయేలీయులారా నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి మన దేవుడైన యెహోవా మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే ఈ నిబంధన చేసెను" (ద్వితీ 5 : 1-3). చాలా సంవత్సరములు గడచిన పిమ్మట పౌలు యిట్లు ప్రశ్నించెను: "ఆలాగైతే ధర్మశాస్త్ర మెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను" (గలతి 3 : 19).

## క్రైస్తవయుగం యొక్క అర్థము

పితరుల యుగంలో దేవుడు కుటుంబ యజమానులతో సంప్రదించెను. మోషే యుగంలో ఒక జనాంగముతో ఒడంబడిక చేసికొనెను. క్రైస్తవ యుగమందు దేవుడు సర్వలోకమునకు ఆజ్ఞాపించుచున్నాడు. ఆయన బోధలు వ్యక్తిగతముగా అందరికీ వర్తించుచున్నవి. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16 : 15).

## నేడు మానవులందరు క్రొత్త నిబంధన క్రిందనున్నారు

పాతనిబంధన యందలి ఆజ్ఞలు వారికొరకు ఉద్దేశింపబడినవి. అవి నెరవేర్చబడి రద్దు చేయబడినవి. క్రొత్తనిబంధన యిప్పుడు చట్టముగా నున్నది. కాబట్టి మనము విశ్వాస మూలమున నీతిమంతుల మని

తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాల శిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతి 3:24-25). ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే" (గలతి 3:11). "ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశ ముండనేరదు అయితే ఆయన ఆక్షేపించి వారితో ఈలాగు చెప్పుచున్నాడు. ప్రభువు ఇట్లనెను - ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటి వారితోను యూదా ఇంటి వారితోను నేను క్రొత్త నిబంధన చేయుదును" (హెబ్రీ 8:7-8).

మానవులు నేడు క్రొత్తనిబంధనను చట్టముగా కలిగియున్నారు. దానికి క్రీస్తు న్యాయాధిపతి, పాతనిబంధన యందలి ఎద్దులు, మేకల కంటె పరిశుద్ధమైన బలి యాగము దానికొరకు అర్పించబడెను. క్రీస్తు బలిగా అర్పింపబడెను. పరలోక రాజ్యము, పాపక్షమాపణ మొదలగు గొప్ప వాగ్దానము లందున్నవి. దేవుని వాక్యమును జాగ్రత్తగా పఠించుము, విశ్వసించుము, విధేయుడవుకమ్ము. అప్పుడు దేవునితో పరలోకమందు విమోచింపబడిన వారితో నిత్యత్వములో పాలు పొందగలవు.

— గయ్. వి. కేసీ.

---

## ప్రభువు మార్గము

## ( The Way of the Lord )

యేసుప్రభువు రెండు సత్యమార్గములను గూర్చి బోధించాడు. ఒకటి, నిత్యజీవానికి, మరొకటి నిత్యనాశనానికి నడిపే మార్గములు

(మత్త 7:13, 14). "నీవు దేవుని మార్గము సత్యముగా బోధించువాడవని" యూదులు ఆయనను గూర్చి అంగీకరించారు (మార్కు 12:14). మానవుడు దేవునితో సమాధానపడునట్లు క్రీస్తు సిలువపై మరణించి ఒక నూతనమైన జీవముగల మార్గమును ప్రతిష్ఠించాడు (హెబ్రీ 10 : 19).

## రాజ మార్గము

పరిశుద్ధ మార్గమనబడు రాజమార్గ మొకటి ఏర్పడునని యెషయా ప్రవచించాడు (యెష 35:8). ఆ మార్గము యేసుక్రీస్తే. "నేనే మార్గమును సత్యమును జీవమును; నా ద్వారానేతప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ఆయన బోధించాడు (యోహాను 14:6). మన మాయన చిత్తమునకు లోబడి ఆయన ననుసరించునప్పుడు "ఈ మార్గములో" యున్నవారమగుదుము. అసలు, ప్రభువు మార్గమంటే యేమిటి? దాన్ని గూర్చి ఈరోజు తెలుసుకొందాము:

ప్రభువు మార్గము విశ్వాస మార్గమని మొదట మనం తెలుసుకోవాలి. అది దేవునియందు ప్రగాఢమైన నమ్మికయుంచే మార్గము. సిలువ వేయబడక కొన్ని గంటల ముందు యేసుప్రభువు, "తండ్రీ నా చిత్తము కాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక" యని ప్రార్థించాడు. సిలువమీద వ్రేలాడుచు చివరిగా యేసు "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నానని" చెప్పాడు (లూకా 22 : 42; 23 : 46). ఆయనకున్న నమ్మికము అట్టిది. మనము కూడ అట్టి నమ్మకమే కలిగియుండాలని ఆయన కోరుచున్నాడు: "నమ్మువానికి సమస్తమును సాధ్యమే". "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అను వాక్యములను మనము క్రొత్త నిబంధనలో తరుచు చూస్తూనే యున్నాము.

దేవునియందు భయభక్తులు కలిగిన వారెల్లప్పుడు గొప్ప నమ్మిక కలిగినవారే. తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో

లేరని వారెరుగుదురు (యిర్మీ 10:23). అందువలన వారు నడిపింపు కొరకు ఎల్లప్పుడు దేవునియందే ఆధారపడతారు. మనము హేబెలు, హనోకు, నోవహు, అబ్రాహాము, మోషే మొదలగువారిని గూర్చి చదువుతాము. వారందరు విశ్వాసమువలన దేవుని మాటను బట్టి నడుచుకొన్నవారు. విశ్వాస మార్గములో పయనించినందున వారి జీవితం విజయమార్గమయ్యింది. ప్రభువు మార్గములో యుండాలంటే, మనముకూడ అట్టి విశ్వాసాన్ని కలిగియుండాలి. లోకమును జయించు విజయము మన విశ్వాసమే (1 యోహాను 5 : 4).

## ప్రేమ మార్గము

ప్రభువు మార్గము ప్రేమ మార్గమని మనము తెలిసికోవాలి. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3 : 16). మన నిమిత్తము మన స్థానములో మరణించుటకు ఆయనను నడిపించినది ప్రేమయే. "తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టు వానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు" (యోహాను 15 : 13). ఆయన తన ప్రాణాన్ని మనకొరకు అర్పించి తన ప్రేమను నిరూపించాడు. యేసు ప్రభువు ఆకలిగొన్నవారికి ఆహారము పెట్టాడు, రోగులను బాగుచేసాడు, చనిపోయినవారిని తిరిగి బ్రదికించాడు. తాను బోధించిన దాని ప్రకారము జీవించాడు. అన్ని విషయములలోను తన ప్రేమ మిన్నయైనదని నిరూపించాడు.

యేసు ప్రభువు శిష్యులు కూడ ఆ ప్రేమ మార్గములో పయనించాలని ఆయన కోరుచున్నాడు. "మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్య

లని అందరును తెలిసికొందురని" ఆయన తన శిష్యులకు ఉపదేశించాడు (యోహా 13 : 34, 35). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురని" మరియొకచోట ఆయన చెప్పాడు (యోహాను 14:15).

యేసుప్రభువు శిష్యులమని చెప్పుకొంటూ ఆయన ఆజ్ఞలను గైకొననివారు ఆయనను ప్రేమించువారు కారు. క్రైస్తవులమని చెప్పుకొనుచు క్రీస్తు స్థాపించిన సంఘములో లేనివారు ఆయనను ప్రేమించువారు కారు. ఆయన చెప్పిన ప్రకారము సువార్తను నమ్మి బాప్తిస్మము పొందనివారు ఆయన శిష్యులు కానేరరు. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక - ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని అట్టివారిని ఆయన ప్రశ్నించుచున్నాడు (లూకా 6 : 46).

## ప్రత్యేకపరచు మార్గము

తరువాత, ప్రభువు మార్గము ప్రత్యేకపరచు మార్గమని మనము గ్రహించాలి. దేవుడు తన ప్రజల నెల్లప్పుడు ప్రత్యేక పరచాడు. ఆయన అబ్రాహామును పిలిచినప్పుడు తన బంధువుల నుండి అతనిని వేరుపరచాడు. ఇశ్రాయేలీయులకు మోషే ద్వారా ధర్మశాస్త్రము నిచ్చినప్పుడది అన్యులనుండి వారిని వేరుపరచింది. అలాగే క్రీస్తు అనుచరులు ఈ లోకములో యున్నను, క్రీస్తు వాక్యము లోకము నుండి వారిని వేరుపరుస్తాది. "మీరు లోక సంబంధులు కారు; నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకొంటిని" అని యేసు తన శిష్యులకు చెప్పాడు (యోహాను 15 : 19).

యేసు ప్రభువు మార్గము నేటికింకను వేరుపరచే మార్గమై యున్నది. ఈలోక స్నేహము దేవునితో వైరము (యాకోబు 4:4); నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక వాటిని

ఖండించుడి (ఎఫెసీ 5:11); మీరు ఈలోక మర్యాదను అనుసరింపక మీ మనస్సు మారి రూపాంతరము పొందుడి (రోమా 12 : 2). "కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన వానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును; మీకు తండ్రినై యుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథీ 6 : 17) ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు అది అతనిని ఈలోకమునుండి వేరుచే స్తాది, ప్రభువు మార్గములో ప్రవేశింపజేస్తాది.

## ఏకైక మార్గము

ప్రభువు మార్గము ఐక్యతగల మార్గమైయున్నది. తన అనుచరులు ఎప్పుడు రకరకాల శాఖలుగా విడిపోవాలని ఆయన ఎన్నడు కోరలేదు. సరిగదా వారంతా ఏకమైయుండాలని ఆయన ప్రార్థించాడు (యోహాను 17 : 20, 21). యూదులు అన్యులుకూడ తమ పూర్వపు ద్వేషమును మాని క్రీస్తు శరీరములో, అంటే ఆయన సంఘములో ఏకమైయుండు నిమిత్తము ఆయన సిలువపై చనిపోయాడు (ఎఫెసీ 2:16). ఆయన ఒకేఒక్క సంఘాన్ని స్థాపించాడు (మత్త 16 : 18). దానికొరకు ఆయన తన రక్తాన్ని చిందించాడు (అపో. కా. 20:28). ఇప్పుడు మానవులందరు ఆయన సంఘముద్వారా క్రీస్తును, దేవుని మహిమపరచాలి (ఎఫెసీ 3:21).

వివిధ శాఖలుగా చీలిపోయి, వివిధ నామములను ధరిస్తూ, వివిధ రీతులుగా ఆరాధిస్తూ, విభిన్న సిద్ధాంతాలను బోధించుచున్న వారు సహజంగా క్రీస్తు మార్గములో యున్నవారు కారు, అట్టివారికి ఆయన "మీరు మారుమనస్సుపొంది తిరుగుడి" యని చెప్పుచున్నాడు. ప్రభువు ఒక్కడే, ఆయన ఏర్పరచిన మార్గము, స్థాపించిన సంఘము ఒక్కటే.

ప్రభువు మార్గము ఆనందదాయకమైన మార్గమని చివరిగా గమనిద్దాం. పాపులు క్రీస్తునొద్దకు వచ్చినప్పుడు సంతోషంతో ఆయన వారి నంగీకరిస్తాడు. వారాయన చిత్తానికి లోబడినప్పుడు సహజంగా వారు ఆనందిస్తారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన ప్రతివాడు తన పాపములనుండి విముక్తి పొందినవాడై సంతోషముతో తన జీవితాన్ని గడుపుతాడు. అందుకే, "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి మరల చెప్పుదును ఆనందించుడి" యని పౌలు క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు.

నీవు ప్రభువు మార్గములో యున్నావా? లేనియెడల ఆయనయందు విశ్వాసముంచి, విధేయతతో ఈనాడే ఆయన మార్గములో ప్రవేశించుము.

— జాషువా గూటం.

---

## రక్షింపబడాలంటే యేమి చేయాలి?

"ఏ భేదమును లేదు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3 : 23).

"మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (I యోహాను 1 : 9).

కాబట్టి నీ పాపములనుండి విడుదల పొందగోరుచున్నావా? అయితే ఈక్రింది విషయాలను నేడే చేపట్టు.

**1.** వినుట :— "కాబట్టి యీ మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును" (మత్తయి 7 : 24).

"నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పు చున్నాను" (యోహాను 5:24).

"దేవుని సంబంధియైనవాడు దేవుని మాటలు వినును. మీరు దేవుని సంబంధులు కారు గనుకనే మీరు వినరని చెప్పెను" (యోహాను 8 : 47).

"వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని - సహో దరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా..." (అపో. కా. 2:37).

"మోషే యిట్లనెను. ప్రభువైన దేవుడు - నావంటి యొక ప్రవక్తను మీ సహోదరులలో నుండి మీ కొరకు పుట్టించును. ఆయన మీతో ఏమి చెప్పినను అన్ని విషయములలో మీరాయన మాట వినవలెను. ఆ ప్రవక్త మాట విననివాడు ప్రజలలో వుండ కుండ సర్వనాశనమగుననెను" (అపో. కా. 3:22-23).

"నీనెవె మనుష్యులు విమర్శకాలమున ఈ తరము వారితో కూడ నిలువబడి వారిమీద నేరస్థాపన చేయుదురు. వారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి. ఇదిగో యోనాకంటె గొప్పవా డిక్కడ వున్నాడు" (లూకా 11:32).

"చెవిగలవాడు ఆత్మ సంఘములతో చెప్పుచున్న మాట వినును గాక" (ప్రకటన 2:7).

2. విశ్వాస ముంచాలి:- "దేవుడు లోకమును ఎంతో ప్రేమిం చెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయ నను అనుగ్రహించెను" (యోహాను 3:16).

"నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పు చున్నాను" (యోహాను 5:24).

"అందుకు వారు - ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురని చెప్పి..." (అపొ. కా. 16:31).

"అదేమనగా - యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10; రోమా 14:23; 1 కొరింథి 13:5; ఎఫెసీ 2:8; 1 తిమోతి 6:12; గలతీ 3:23, 24-26; కొలస్స 2:12; హెబ్రీ 11:1-6; యాకోబు 2:14; 5:15; యాకోబు 2:26).

3. మారుమనస్సు పొందాలి:-"ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా వుండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ. కా. 17:30).

"పేతురు - మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ. కా. 2 : 38).

కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని, యెవడును నశింప

వలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (II పేతురు 3 : 9. మత్తయి 3 : 1; మత్తయి 4 : 17; మత్తయి 18 : 3; లూకా 11 : 32; 13 : 3-5.

"మీ కొరకు నియమించిన క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ. కా. 3 : 20).

4. ఒప్పుకోవాలి:-"అందుకు సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను" (మత్తయి 16 : 16).

"మరియు నేను మీతో చెప్పున దేమనగా, నన్ను మనుష్యుల యెదుట ఒప్పుకొనువాడెవడో, మనుష్య కుమారుడు దేవుని దూతల యెదుట వానిని ఒప్పుకొనును" (లూకా 12 : 8).

"యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో, వానిలో దేవుడు నిలిచియున్నాడు, వాడు దేవుని యందున్నాడు" (1 యోహాను 4 : 15).

మత్తయి 10 : 32, 33; మార్కు 1 : 5; అపొ. కా. 18 : 4; రోమా 10 : 9, 10; II కొరింథి 1 : 13; I తిమోతి 6 : 12; ఫిలిప్పీ 2 : 11; I యోహాను 1 : 9.

5. బాప్తిస్మము పొందాలి:-"పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. కా. 2 : 38).

"క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?" (రోమా 6 : 3).

మత్తయి 28 : 18; అపొ. కా. 2 : 38; 2 : 41; 16 : 15; 16 : 33; 22 : 16, ఎఫెసీ 4 : 4, 5; గలతీ 3 : 27; కొలస్స 2 : 12; I పేతురు 3 : 21.

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16).

కావున మీరు వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను. "ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను మీరు నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందురు? (హెబ్రీ 2 : 1-2).

— ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ.

---

## కాకినాడ బిల్డింగుకు కానుకలిచ్చినవారు

| | | |
|---|---|---|
| A. ధనపాల్, చిన్న పడుగుపాడు | Rs. | 100-00 |
| P. దేవానందం, గుంటూరు | | 100-00 |
| M. జాన్, సేలం | | 25-00 |
| T. చెంచన్న, నిజామాబాద్ | | 40-00 |
| K. వీరారెడ్డి, పెద్దతుంబలం | | 15-00 |
| Ch. V. ప్రసాద్, మారెమండ | | 100-00 |
| Y.P. కెజీయా, విశాఖపట్నం | | 50-00 |
| D. అబ్రహాము, నడిపూడి | | 100-00 |
| D. పద్మనాభం, జగన్నాధగిరి | | 105-00 |
| K. సత్యం, క్రొత్త ఢిల్లీ | | 50-00 |
| K. కామరాజు | | 100-00 |
| T. జోసఫ్, గోవా | | 100-00 |
| A. మాణిక్యం, నెల్లూరు | | 50-00 |
| G. & G. బైబిలు బుక్ స్టోర్, విజయవాడ | | 100-00 |
| బైపాస్‌రోడ్ క్రీస్తు సంఘము, విజయవాడ | | 50-00 |

| | |
|---|---|
| M. సుగుణమ్మ, యర్రగుంట్ల | 100-00 |
| R. పైడియ్య, బోడసకుర్రు | 50-00 |
| M. బ్లెస్సీసమ్మ, హైదరాబాదు | 150-00 |
| R.G. జాంబయ్య, బళ్ళారి | 100-00 |
| రంపచోడవరం క్రీస్తు సంఘం, Bro. B. రత్నంగారి ద్వారా | 2000-00 |
| E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు | 500-00 |
| G. లిల్లీ పుష్పం, N.G. పాలెం | 100-00 |
| P. బాబూరావు, విశాఖపట్నం | 30-00 |
| Ch. నాగరత్నమ్మ, మంగళదాం | 100-00 |
| P.B. ధన్, గిన్నేపల్లి | 1000-00 |

కాకినాడ భవన నిర్మాణము నిమిత్తం విరాళములిచ్చిన ప్రతివారికి మా హృదయపూర్వక వందనములు. ★

Regd. No. H/KD—45/KD.R.O.

*From*
**SATYA WAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

No.

To

..........................................

..........................................

..........................................

..........................................